# లేండిజాలకు మెస్రం వంశీయుల పాదయాత్ర



ఝురికి ప్రత్యేక పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు

- గురువారం గోదావరి పరీవాహక హస్తినమడుగుకు..
- ఝురికి ప్రత్యేక పూజలు

జైనూర్, జనవరి 24 : నాగ దేవత మహా పూజ కోసం గంగాజలం సేకరణకు బయలు దేరిన మెస్రం వంశీయుల పాదయాత్ర లేండి జాల గ్రామానికి చేరుకున్నది. కెస్లాపూర్ నుంచి ఈ నెల 21న ప్రారంభమైన ఈ యాత్ర బుధవారం ఇక్కడికి చేరుకున్నది. బుధవారం రాత్రి గౌరీ గ్రామంలో బస చేశారు. గురువారం సిర్పూర్ (యూ) , లింగాపూర్ మండలాల మీదుగా గోదావరి నది పరివాహక ప్రాంతమైన హస్తినమడుగుకు యాత్ర చేరుకోనున్నది. అంతకు ముందు లేండిజాలకు చేరుకున్న కలశానికి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశీయుల ప్రధాన పూజారి (కటోడ) మెస్రం కోసు, కొత్వాల్ మెస్రం తిరుపతి, దాదారావు, ఎంపీపీ కుమ్రం తిరుమల, గ్రామ పటేల్ మెస్రం బాదీరావు, భీంరావ్, పాలక్‌రావు, తానాజీ, జంగు, రూప్‌దేవ్, అంబాజీ రావు, కాశీరాం,దౌలత్ రావు పాల్గొన్నారు.

## సబ్సిడీ సిలిండర్ల స్వాధీనం



సబ్సిడీ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 24: పట్టణంలో అక్రమంగా వినియోగిస్తున్న 18 సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని మున్నీబార్ అండ్ రెస్టారెంట్‌లో 5, కాకతీయ మెస్‌లో 7, మున్నీ హోటల్‌లో 6 సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. డీటీలు శ్యామ్‌లాల్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, ఆర్ఐ రాజేశ్, సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. సిలిండర్లను స్థానిక హెచ్‌పీ గోదాంకు అప్పగించి భద్రపర్చినట్లు పేర్కొన్నారు. యజమానులపై కేసులు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించినట్లు తెలిపారు.

## కాంప్లెక్స్ నిర్మాణం పూర్తిచేయాలి



కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న డీసీసీబీ జీఎం అనుపమ, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 24: జిల్లా కేంద్రంలోని జూబ్లీ మార్కెట్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో కొత్తగా నిర్మిస్తున్న కమర్షియల్ కాంప్లెక్స్, అగ్రి లే అవుట్ శిక్షణ కేంద్ర భవనాన్ని త్వరిత గతిన పూర్తి చేయాలని డీసీసీబీ జీఎం అనుపమ అన్నారు. బుధవారం సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్‌తో కలిసి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం చేపట్టిన కాంప్లెక్స్ నిర్మాణం, ఆగ్రీ లే అవుట్ నిర్మాణం పూర్తి చేసి వాడుకలోకి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సుమన్, డీసీసీబీ ఆసిఫాబాద్ మేనేజర్ అనిల్ తదితరులు ఉన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కౌటాల, జనవరి 24: మండలంలోని గురుడుపేట గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కౌటాల వారి ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యత, సాంకేతిక అక్షరాస్యతపై బ్యాంకు మేనేజర్ నరసింహస్వామి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని, అంతే కాకుండా బ్యాంకులో డబ్బులు జమ చేసుకోవడం వలన భవిష్యత్ ఎంతో బాగుంటుందని ఆయన తెలిపారు. బ్యాంకులో అన్ని రకాల వారికి అనేక రకాల రుణ సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. రుణాలు తీసుకున్న వారు సకాలంలో చెల్లించడం వలన వడ్డీ తగ్గడంతో పాటు తిరిగి ఎక్కువ మొత్తంలో రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఆయన బీఎం సూచించారు. అకౌంటంట్ రాజేశ్, ఫీల్డ్ ఆఫీసర్ మనోహర్, మాజీ సర్పంచ్ బ్రహ్మయ్య, మాజీ ఎంపీపీ గంగారాం, సీఎస్పీ విలాస్ ఉన్నారు.

## మున్నూరు కాపు సంఘం కార్యవర్గం

దహెగాం,జనవిరి24: మండల మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ, పుప్పాల శ్రీనివాస్ తెలిపారు. అధ్యక్షుడిగా పుప్పాల సంతోష్, ఉపాధ్యక్షుడిగా సుంకరి వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి తోట చందు,కోశాధికారి తోట రాజన్న, ప్రచార కార్యదర్శులు పుప్పాల లక్ష్మి, నారాయణ, సభ్యులు దబ్బట సత్యనారాయణ, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు కలికోట రామయ్య, గౌరవ అధ్యక్షుడు గజ్జి రామయ్య, నాయకులు ఇందూరి వెంకటేశ్ పాల్గొన్నారు.

## బీటీ రోడ్డు నిర్మించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 24: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ చెక్ పోస్ట్ నుంచి ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మించాలని అఖిల పక్షం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్‌కి వినతి పత్రం అందజేశారు. రోడ్డు నిర్మించకపోవడంతో పట్టణ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, గుండి రోడ్డు మీదుగా లింక్ రోడ్డు ఇప్పటికే మంజూరైనప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదని తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో జడ్పీటీసీ అరిగేలా నాగేశ్వరరావు, నాయకులు రేగుంట కేశవ్ రావు, దుర్గం దినకర్, గొడిసెల కార్తిక్, రూప్‌నార్ రమేశ్, తిరుపతి, రాజ్‌కుమార్, మారుతి, చిరంజీవి తదితరులున్నారు.

## పరిశుభ్రత పాటించాలి

జైనూర్, జనవరి 24 : పరిసరాల పరిశుభ్రత పాటించాలని జైనూర్ గ్రామ పంచాయతీ ఈవో శ్రీనివాస్‌రెడ్డి బుధవారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు కలిసి వివిధ కాలనీల్లో పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ కవర్లను తొలగించారు. గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

## నేడు వైద్యశిబిరం

దహెగాం,జనవరి24: మండల కేంద్రంలో గురువారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుజాడి లక్ష్మయ్య, బుజాడి కాళిదాస్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 16 ఏండ్లలోపు వారికి రోగనిరోధ శక్తి పెంచడానికి మందును అందిస్తామన్నారు. ఈ వైద్య శిబిర ప్రారంభానికి ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి




మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి యువరాజా

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 24: బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి యువరాజా అన్నారు. బుధవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడారు. బాలికలు తమ హక్కులను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. బాలికలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. బాలికలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ముందుకు సాగాలని, సమాజంలో బాలికల పాత్ర ఎంతో కీలకమన్నారు. అనంతరం పాఠశాల వంట గదిని పరిశీలించి నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ అంజనిదేవి తదితరులు ఉన్నారు.

## వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలి

**కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ**




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 24: పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవితో కలిసి మండల విద్యాధికారులు, ప్రత్యేకాధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

## రైతు మృతి కేసులో ఒకరి రిమాండ్



అరెస్టు చూపుతున్న సీఐ శ్రీనివాస్, కెరమెరి ఎస్ఐ విజయ్

వాంకిడి, జనవరి 24 : ధనోరా కోలాం గూడ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వన్య ప్రాణులను వేటాడేందుకు అమర్చిన విద్యుత్ తీగ తగిలి రైతు మృతికి కారణమైన ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించినట్లు వాంకిడి సీఐ శ్రీనివాస్ తెలిపారు. వాంకిడి పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ధవోరా కొలాం గూడకు సీడాం బట్టి సోమవారం రాత్రి వేటకు వెళ్దామని భీముకు చెప్పాడు. ఈ మేరకు సీడాం బట్టి చెప్పిన ప్రదేశానికి రాత్రి 9 గంటలకు భీము వెళ్లాడు అప్పటికే అక్కడ అమర్చి ఉన్న విద్యుత్ తీగను గమనించకుండా భీము తాకడంతో విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య భీంబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు సీడాం బట్టిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. వన్య ప్రాణులను వేటాడినా విద్యుత్ తీగలు అమర్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో కెరమెరి ఎస్ఐ విజయ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఏవో శ్రీనివాస్ రావు

కౌటాల, జనవరి 24: నకిలీ విత్తనాలు, నకిలీ మందులు విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్స్ రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని విత్తనాలు, ఎరువుల రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. రైతుల వివరాలను, ఆధార్ కార్డు వివరాలను రికార్డుల్లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. విక్రయించిన వెంటనే తప్పనిసరిగా రసీదు అందించాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి పాలకుర్తి రాజేశ్ ఉన్నారు.



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

## పెద్ద దేవుళ్ల ఉత్సవాలు

సిర్పూర్(యు), జనవరి 24 : పుష్య మాసం పురస్కరించుకొని సిర్పూర్(యు) మండలంలోని గిరిజన గ్రామాల్లో ఆదివాసుల పెద్ద దేవుళ్ల ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలోని ఖాతిగూడ గ్రామంలో తమ చాందకార్ వంశ పెద్ద దేవుడి ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెలించి, పెద్ద దేవుడి(పెర్సపెన్) ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనతి కాలం నుంచి వస్తున్న ఆదివాసుల సంస్కృతీసంప్రదాయాలు నేటికీ భావితరాలకు తెలియజేసేలా ఆచార వ్యవహారాలు పాటిస్తూ మార్గదర్శకంగా నిలువడం కేవలం ఆదివాసులకే సాధ్యమని అన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి

సిర్పూర్(యు) జనవరి 24 : యువత క్రీడల్లో రాణించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావ్ అన్నారు. బుధవారం మండలంలోని సీతాగొంది గ్రామపంచాయతీలోని పనగడి గూడలో జోరమ్మ తల్లీ (అవ్వాల్)పేన్ ఉత్సవాల్లో భాగంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తొడసం ధర్మారావ్, తండ్రి అవ్వాల్ పేన్ కటోడ తొడసం మారు జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో ఆయన పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తొడసం విజయ,మాజీ ఎంపీటీసీ ఆత్రం వెంకట్ రావ్, నాయకులు గేడం లక్ష్మణ్ ఉన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావ్

## పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలి



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డీఈవో

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 24: విద్యార్థులు పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలని డీఈవో పార్శి అశోక్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో పఠన సంస్కృతిని ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో జిల్లా విద్యా శాఖ, రూం టూ రీడ్ వారి సహకారంతో బుధవారం ఏర్పాటు చేసిన తెలుగు భాష జిల్లా స్థాయి పఠన పోటీల కార్యక్రమానికి హాజరయ్యారు. పోటీల్లో పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో దహెగం మండలం చిన్నరాస్పల్లికి చెందిన సంజన ప్రథమ, వాంకిడి మండలం లెండిగూడకు చెందిన సిద్ధేశ్వర్ ద్వితీయ, దహెగాం మండలం హత్తిని లో సంయుక్త తృతీయ స్థానంలో నిలిచారు. రూం టూ రీడ్ ప్రతినిధులు జెన్నీఫర్, పూర్వ జిల్లా ఇన్ చార్జి నితిన్, హెచ్ఎం సుభాష్, ఉషన్న, క్వాలిటీ కో ఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్ తదితరులున్నారు.

## భీం ఆశయ సాధనకు కృషి



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

బెజ్జూర్, జనవరి 24 : భీం పోరాట స్ఫూర్తితో అమల్లోకి వచ్చిన ఐటీడీఏ, జీవో నం. 3, పెసా చట్టాలను పూర్తి స్థాయిలో అమలయ్యేలా చూస్తానని సిర్పూర్ ఎమెమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కుమ్రం భీం విగ్రహాన్ని జడ్పీ చైర్మన్ కృష్ణారావుతో కలిసి ఆవిష్కరించారు. భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. జల్.. జంగిల్.. జమీన్ నినాదంతో నైజాం సర్కారుతో పోరాడి వీర మరణం పొందిన భీం ఆశయ సాధనకు ఆదివాసులంతా ఐక్యంగా కృషి చేయాలన్నారు. గతంలో ఐటీడీ, బీటీడీలు, అవ్వాల్ కమిటీల ద్వారా గిరిజన గ్రామాల్లో గిరిజనులకే రాజ్యాధికారం ఉండేదని ఆదివాసీ నాయకులు తెలుపగా, ఎమ్మెల్యే స్పందిస్తూ ఐటీడీఏకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఐటీడీఏ పీవో ఆధ్వర్యంలో ప్రజాదర్బార్‌లు ఏర్పాటు చేసి గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అటవీ అనుమతులు తీసుకొచ్చి బెజ్జూర్–సోమిని, బెజ్జూర్ నుంచి కమ్మర్గాం తదితర గ్రామాలకు రోడ్లు వేయించేలా చూస్తామన్నారు. జీవో నం.3ను పునరుద్ధరించడానికి అవసరమైతే సుప్రీం కోర్టు వరకు వెళ్లడానికి కూడా సిద్ధమేనన్నారు. సభలో బాబాపూర్, బెజ్జూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థినులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జడ్పీటీసీ పంద్రం పుష్పలత, డీసీఎంఎస్‌వైస్ చైర్మన్ కుమ్రం మాంతయ్య, సహకార సంఘం చైర్మన్ కుర్సింగ ఓంప్రకాశ్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సిడాం గణపతి, ఆదివాసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి కోర్తె తిరుపతి, సర్పంచ్ అన్సార్ హుస్సేన్, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తలండి లక్ష్మణ్, మండల గిరిజన నాయకులు సిడాం సాకారం, మెస్రం రాజారాం, కొడ్ప విశ్వేశ్వర్, కోర్తె శంకర్, సర్పంచులు, ఎంపీటీసీలు, గిరిజన ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఈసగాం శివమల్లన్న ఆలయ హుండీ లెక్కింపు

ఎస్పీయం కాలనీ కాగజ్‌నగర్, జనవరి 24 : మండలంలోని ఈసగాం శివమల్లన్న ఆలయ హుండీ లెక్కింపు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆదిలాబాద్ డివిజన్ పరిశీలకులు ఎం.రాజమౌళి పర్యవేక్షణలో బుధవారం నిర్వహించారు. గతేడాది 27 ఫిబ్రవరి నుంచి ఈ నెల 24వ తేదీ వరకు హుండీల ద్వారా రూ. 3,42,395 ఆదాయం వచ్చిందని రాజమౌళి తెలిపారు. హుండీ లెక్కింపులో అరుణోదయ విద్యాలయ విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు. ఈసగాం పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వహణాధికారి గర్రెపల్లి వేణుగోపాల్ గుప్తా, గంగాపూర్ శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్వహణాధికారి బాపురెడ్డి, అర్చకులు ఇందారపు సంతోష్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంప్లెక్స్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 24: జిల్లా కేంద్రంలోని జూబ్లీ మార్కెట్‌లో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో కొత్తగా నిర్మిస్తున్న కమర్షియల్ కాంప్లెక్స్, అగ్రి లే అవుట్ శిక్షణ కేంద్ర భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని డీసీసీబీ జీఎం అనుపమ తెలిపారు. బుధవారం సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్‌తో కలిసి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం చేపట్టిన కాంప్లెక్స్ నిర్మాణం, ఆగ్రి లే అవుట్ నిర్మాణం పూర్తి చేసి వాడుకలో తేవాలని సూచించారు. ఏజీఎం సుమన్, డీసీసీబీ ఆసిఫాబాద్ మేనేజర్ అనిల్ తదితరులున్నారు.

## నాల్గోతరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

కాగజ్‌నగర్ టౌన్ , జనవరి 24: సివిల్ సప్లై కార్పొరేషన్‌లో పనిచేస్తున్న హమాలీ కార్మికులను నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగె ఉపేందర్ అన్నారు. మార్కెట్ యార్డులోని గోదాంలో బుధవారం సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదన్నారు. కార్మికులకు ఈఎస్ఐ ఇన్సురెన్స్ సౌకర్యాలను కల్పించాలని, పీఎఫ్, పింఛన్ సౌకర్యం, యూనిఫాం, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఫిబ్రవరి 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు సురేశ్, కిషన్, శంకర్, నారాయణ, నవీన్, అంజి, రాజు, సురేశ్, నాగరాజు, జయాకర్, తదితరులు పాల్గొన్నారు.

## కూలీల సంఖ్య పెంచాలి

సిర్పూర్(యు), జనవరి 24 : ఉపాధిహామీలో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో మధుసూదన్ అన్నారు. మండలకేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన పంచాయతీ కార్యదర్శులు,ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఎంపీడీవో మాట్లాడుతూ తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా కూలీలకు సక్రమంగా పని కలిపించడంతో పాటు కూలీల సంఖ్య పెంచి పని శాతం పెంచాలన్నారు. కాగా వచ్చే హరితహారంలో నాటేందుకు నర్సరీలో మొక్కలు పెంచే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. గురువారం నిర్వహించే ఓటర్స్ డే కార్యక్రమాని ప్రతి గ్రామ పంచాయతీల్లో నిర్వహించాలని కార్యదర్శులకు ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.

## అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్

వాంకిడి,జనవరి 24 : ఆకస్మికంగా జరిగే అగ్నిప్రమాదాల నివారణ గురించి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం అధ్యాపకులు, విద్యార్థులకు జిల్లా ఫైర్‌స్టేషన్ ఆఫీసర్లు సతీశ్, మహేశ్ అవగాహన కల్పించారు. హెచ్‌పీ సిలిండర్ ప్రమాద సమయంలో బేకింగ్‌సోడా వినియోగించి మంటలను ఎలా ఆర్పాలో ప్రదర్శన ద్వారా చూపించారు. అలాగే ఇంట్లో జరిగే ఎలక్ట్రిక్ ప్రమాదాలను బేకింగ్‌సోడాతో ఎలా నియంత్రించవచ్చో చూపించారు. వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో (డీఐఈవో) నైతం శంకర్, ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చంద్రయ్య, అధ్యాపకులు సురేంద్ర కుమార్, సంతోష్, రాజమౌళి, శ్రీధర్, కిరణ్‌కుమార్, తిరుపతి, సత్యం, అశ్విని, శ్రీకాంత్, ఫైర్ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## లేతన్‌గూడలో క్రీడా పోటీలు

రెబ్బెన, జనవరి 24: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఎంపీపీఎస్ లేతన్‌గూడ పాఠశాలలో విద్యార్థినులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. బాలికలు చదువుతో పాటు ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో రాణించాలని హెచ్ఎం రవికుమార్ సూచించారు.

**వాంకిడిలో..**

వాంకిడి, జనవరి 24 : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు క్రీడా పోటీలను పాఠశాల హెచ్ఎం నటరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఆట స్థలంలో బుధవారం విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, వ్యాసరచన, క్విజ్, లాంగ్‌జంప్ తదితర పోటీలను నిర్వహించారు. విజేతలకు ఈ నెల 26న బహుమతులను అందజేయనున్నారు.

## వివరాలు నమోదు చేసుకోవాలి

పెంచికల్ పేట్, జనవరి 24 : ప్రతి రైతు తమ యాసంగి పంటల వివరాలను నమోదు చేసుకోవాలని ఏఈవో శ్రీవిద్య సూచించారు. మండలంలోని కొండపల్లి గ్రామంలో బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ పంటల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ పంటను అమ్ముకోవడానికి వివరాలను అంతర్జాలంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

## గ్రామాల్లో ర్యాపిడ్ ఫీవర్ సర్వే

జైనూర్, జనవరి 24 : మండలంలోని గొంది పటార్ తదితర గ్రామాల్లో ర్యాపిడ్ ఫీవర్ సర్వే కొనసాగుతున్నది. బుధవారం మండలంలోని ఉషేగాంలో సర్వే నిర్వహించారు. డ్రమ్ములు, డబ్బాలో ఉన్న రోజుల తరబడిగా నిల్వ ఉన్న నీటిని వైద్య సిబ్బంది తొలగించారు. అనంతరం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ డ్రమ్ములు, ప్లాస్టిక్ డబ్బాలు, సీసాలు తదితర వస్తువుల్లో ఎక్కువ రోజుల పాటు నీటిని నిల్వ ఉండకుండా చూడాలన్నారు. గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ జాదవ్ రమేశ్, హెల్త్ అసిస్టెంట్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేడుకలు ఘనంగా నిర్వహించాలి

రెబ్బెన, జనవరి 24: బెల్లంపల్లి ఏరియా గోలేటి శ్రీ భీమన్న క్రీడా మైదానంలో ఈ నెల 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని బెల్లంపల్లి ఏరియా ఎస్‌వోటూ జీఎం, ఇన్‌చార్జి జీఎం మచ్చగిరి నరేందర్ అధికారులకు సూచించారు. బుధవారం ఏరియాలోని గోలేటి శ్రీ భీమన్న క్రీడా మైదానాన్ని పరిశీలించారు. ఏర్పాట్లపై పలు సలహాలు, సూచనలు అందించారు. బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సివిల్ సూపర్‌వైజర్ వెంకటేశ్ ఉన్నారు.

## జాతీయ బాలికా దినోత్సవం

కెరమెరి, జనవరి 24 : కెరమెరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బాలికలు ఉన్నతంగా చదువుకున్నప్పుడే సమాజంలో ధైర్యంగా జీవించడం సాధ్యపడుతుందన్నారు. స్థానిక కేజీబీవీలో బాలికలు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. నృత్యాలు అలరించాయి. కార్యక్రమాల్లో గెజిటెడ్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, అధ్యాపకులు సరళా, కౌసల్య, మోడీ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత, ఏఎస్ఐ జాదవ్ ఉల్లాస్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

**రెబ్బెనలో..**

రెబ్బెన, జనవరి 24: మండలంలోని గోలేటి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిరుపతమ్మ హాజరయ్యారు. విద్యార్థులకు ఆటపాటలు నిర్వహించిన అనంతరం చిన్నారులు, గర్భిణులు, బాధితులు, తల్లులకు పాయసం, బిస్కెట్లు పంపిణీ చేశారు అంగన్వాడీ టీచర్ మంజుల, ఆయా లత పాల్గొన్నారు

## క్యాలెండర్ ఆవిష్కరణ

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 24 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో తెలంగాణ వసతి గృహ సంక్షేమ సంఘం–2024 క్యాలెండర్‌ను కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్‌రావ్ బుధవారం ఆవిష్కరించారు. టీఎన్జీవో జిల్లా కన్వీనర్ రాజశేఖర్, ఉమెన్ ప్రెసిడెంట్ కర్ణశ్రీ, టీహెచ్‌డబ్ల్యూ ప్రెసిడెంట్ శ్రీనివాస్, సెక్రెటరీ బోగ మధూకర్, సభ్యులు దేవాజీ, కీర్తి పాల్, ఎస్మాని, చందన, రేష్మ భాను ఉన్నారు.